# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెళ్ల చిన్నారెడ్డి

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెళ్ల చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ఒక ప్రైవేట్ బ్యాంకిట్ హాల్లో నిర్వహించిన రామన్ ఐఐటీ టాలెంట్ టెస్ట్ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న తరానికి అత్యున్నత స్థాయి విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులు తమ జన్మభూమికి సేవలందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణ, సంస్కారం అలవర్చుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. టాలెంట్ టెస్ట్‌ను సమర్థవంతంగా నిర్వహించిన డి. రాములు యాదవ్‌ను డా. చిన్నారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, ప్రజావైద్యశాల డైరెక్టర్ డా. మురళీధర్, సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో విజేతలుగా నిలిచిన దాదాపు 50 మంది విద్యార్థులకు



డా. చిన్నారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, నందిమల్ల యాదయ్య, ఉపాధ్యాయులు బైరోజు చంద్రశేఖర్, ఎం.ఏ. సత్తార్, గంధం నాగరాజు, దేశి రమాదేవి, ప్రవీణ్, భాస్కర్, రాజేంద్రప్రసాద్ చారి, షఫీ, మద్దిలేటి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నంబావి మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదం

**సకాలంలో హాస్పిటల్‌కు తరలించిన 108 సిబ్బంది**



**అగ్ని ధార న్యూస్ చిన్నంబావి మండలం** చిన్నంబావి మండల కేంద్రంలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. మండలం నుంచి పెబ్బేర్ వైపు వెళ్తున్న బైక్, జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలో ముందుగా వెళ్తున్న ఎద్దుల బండిని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామానికి చెందిన శాలి భాషకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనను గమనించిన స్థానికులు, పోలీసు సిబ్బంది వెంటనే 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చిన్నంబావి మండల 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మేకల శ్రీధర్, డ్రైవర్ శివయ్య హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తికి ప్రాథమిక చికిత్స అందించి అంబులెన్స్ ద్వారా కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

## రామగుండంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

**6,7,8,1,24,31 డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం**

**క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందికి సూచనలు ఇచ్చిన డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని 6, 7, 8, 1, 24, 31 డివిజన్లలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మరియు నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ ఆదేశాల మేరకు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రైవ్‌లో భాగంగా రోడ్లపై చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, కాలనీల్లో అపరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజారోగ్యానికి హానికరంగా మారుతున్న చెత్తను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, సంపత్ పర్యవేక్షించారు. శానిటేషన్ జవాన్లు, మెప్మా సిబ్బంది విస్తృతంగా పాల్గొని పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లను తరచూ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

## కొప్పునూర్ ఎస్సీ హాస్టల్లో ప్రపంచ లూయీ బ్రెయిలి దినోత్సవం

**బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి వార్డెన్ రవీందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ చిన్నంబావి మండలం**చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూర్ గ్రామ ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉదయం ప్రార్థన సమయంలో ఇంచార్జి వసతి గృహ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ – ఈరోజు లుయీ బ్రెయిలీ జయంతి అతని పేరు మీరెప్పుడైనా విన్నారా? విననివారు ఎవరైనా ఉంటే కొంత వరకు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం అని అన్నారు. బ్రెయిలీ తన చిన్నతనంలోనే ప్రమాదవశాత్తు చూపు పూర్తిగా కోల్పోయాడు. చూపులేని వాళ్ల బాధలు ఎలా ఉంటాయో అనుభవ పూర్వకశీగా గమనించాడు. అలాంటి బాధ ఇంకెవ్వరు పడకూడదు అనుకుని తన దృఢ సంకల్పం తో ఆరు చుక్కల లిపిని తానే స్వయంగా అభివృద్ధి చేసి, చూపులేని ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారు. చూపులేని వాళ్ళు జీవితంలో ఎలాంటి కష్టం ఎదురైనా భయపడకుండా, న్యూనతా బాధతో బతకకుండా ఆదిగమించాలి అనేవారట. చూపులేని వాళ్లు మిగతా అందరిలాగే మరో మార్గం చూసుకోవాలనే సంకల్పం ఉన్నవారికి స్ఫూర్తి నిచ్చారు. ఆయన ఆవిష్కరించిన లిపి ఇప్పుడు ఎందరో జీవితాలలో ఆశాకిరణమై సగర్వంగా ముందుకు నడిపిస్తుంది. మన ఇంట్లో ఒక్క క్షణం కరెంట్ పోతేనే తట్టుకోలేము. అలాంటిది అసలు చూపే లేకుంటే జీవితాంతం ఎలా గడపాలో ఊహించడం కూడా కష్టమే. అలాంటి చూపులేని వాళ్ళ జీవితాలలో తను పరిచయం చేసిన లిపితో ఎందరో జీవితాల్ని మార్చాడు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అంధుల ఆశ్రమ పాఠశాలల్లో అలాంటి ఎందరో విద్యార్థులు చేరి, పేరుకే మేము అంధులం ప్రతిభలో మాత్రం కాదని మిగతా వారితో పోటీ పడుతూ, ఉన్నతంగా రాణిస్తున్నారు. చదవడం, రాయటం మాత్రమే కాకుండా, చదరంగం ఆడటం లాంటి ఇతర



ఆటలలో చురుగ్గా పాల్గొంటున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పథకాలు కూడా సాధిస్తున్నారు. అందుకే అంధుల వరప్రసాదం అయిన లిపిని కనుగొన్న లూయీ బ్రెయిలీని మరోసారి స్మరించుకుందాం అన్నారు. ఈ కార్యక్రమశీలో వసతిగృహ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి తో పాటు,విద్యార్థులు,వర్కర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పెద్దపల్లి జిల్లాలో ఎంపీ విస్తృత పర్యటన

**గనికార్మికులతో కలిసి అల్పాహారం నుంచి వివిధ పరామర్శల వరకు**

**ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధి**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ సోమవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. ప్రజల మధ్య ఉండాలనే సంకల్పంతో చేపట్టిన ఈ పర్యటనలో ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 6.30 గంటలకు గోదావరి ఖనిలోని 11 ఇంక్లైన్ గనిని సందర్శించి, గనికార్మికులతో కలిసి అల్పాహారం చేస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు మంథని నియోజకవర్గంలోని సుందిళ్ల లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఓదెల కొలనూరు రైల్వే గేట్ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. తరువాత మధ్యాహ్నం 1.30 గంటలకు సుల్తానాబాద్‌లో కాక వీరాభిమాని రాహుల్ గారి పుత్రుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం 2.30 గంటలకు ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో మేకల కుమార్ గారిని పరామర్శిస్తారు. అనంతరం సాయంత్రం 3 గంటలకు అదే మండలంలో సాక్షి రిపోర్టర్ స్వామిరెడ్డి గారిని పరామర్శించనున్నారు. సాయంత్రం 3.30 గంటలకు ధర్మపురి మండలం బుగ్గారం గ్రామంలో బాదినేని రాజేందర్ గారి




కుటుంబాన్ని పరామర్శిస్తారు. తదుపరి సాయంత్రం 4.30 గంటలకు పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ గారిని నంచర్లలో పరామర్శించనున్నట్లు ఎంపీ కార్యాలయం వెల్లడించింది. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ పర్యటన చేపట్టినట్లు ఎంపీ వంశీకృష్ణ తెలిపారు.

## పరీక్షల వేళ గాబరా వద్దు రివిజన్ విధానాలే విజయానికి మార్గం

**టిల్ ఫ్లవర్ స్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ నీలం పాపయ్య నాయుడు**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** పరీక్షల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధమవ్వాలని లిటిల్ ఫ్లవర్ స్కూల్ వ్యవస్థాపకులు పాపయ్య నాయుడు సూచించారు. ఏడాది పొడవునా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు శ్రమించి నేర్చుకున్న పాఠాలను ఈ పరీక్షల సమయంలో సక్రమమైన రివిజన్ ద్వారా నెమరువేసుకోవాలని తెలిపారు. గాబరా పడకుండా గురువులు చెప్పిన మెలకువలను గుర్తు చేసుకుంటూ చదవాలని సూచించారు. రోజువారీ రివిజన్ షెడ్యూల్ పాటించడం, ముఖ్యాంశాలను గుర్తుంచుకోవడం, సరైన నిద్రతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం పరీక్షల్లో మంచి ఫలితాలకు దోహదపడుతుందని అన్నారు.

**చివరగా ఆయన మాట్లాడుతూ,**

“పరీక్షలు భయపడే విషయం కాదుడ మన శ్రమను మనమే పరీక్షించుకునే అవకాశం మాత్రమే” అని పేర్కొన్నారు.

## జర్నలిస్ట్ సాయిశంకర్‌ను పరామర్శించిన ఎంపీ వంశీకృష్ణ.



**అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్** కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన బండ సాయిశంకర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ వంశీ కృష్ణ ఆదివారం జూలపల్లిలోని సాయిశంకర్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిశంకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్యాలయంలో నేడు సమావేశం

**ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో చర్చ**

**ఖితపూర్వకంగా అభ్యంతరాలు సమర్పించాలి**

**కమిషనర్ అరుణశ్రీ**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాపై చర్చించేందుకు సోమవారం ఉదయం 11 గంటలకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ తెలిపారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు. ముసాయిదా ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే వాటిని లిఖితపూర్వకంగా సమర్పించాల్సిందిగా కమిషనర్ సూచించారు. ఓటరు జాబితా లోపరహితంగా సిద్ధం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

## గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఎంపీ వంశీకృష్ణ మీడియా సమావేశం

**బీఆర్ఎస్ పాలన అప్పుల మయం**

**.. కాంగ్రెస్ హయాంలో ప్రజాపాలన**

**పేదల కోసం కాదు.. ఆదానీఅంబానీల కోసం బీజేపీ పని చేస్తోంది**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):** మంచి ఆదాయం ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ విమర్శించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని, గత రెండేళ్లుగా రాష్ట్రంలో నిజమైన ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుపేదల అభ్యున్నతిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన రేషన్ కార్డుల జారీ జరుగుతోందని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని పార్లమెంట్‌లో ప్రస్తావించానని, మరోసారి కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. నిరుపేదలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రావాల్సిన సెమీకండక్టర్ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, బీజేపీ పాలన పేదల కోసం కాకుండా ఆదానీ, అంబానీల కోసం మాత్రమే పనిచేస్తోందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి కేంద్రం నుంచి రూ.4,500 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందని, రోడ్లు, రైల్వే లైన్లు, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. మహాత్మాగాంధీ పేరు తొలగించే కుట్రలను కేంద్రం చేస్తోందని ఆరోపించారు. ఎన్టీపీసీ అధికారులతో 2400 మెగావాట్ల పవర్ ప్రాజెక్టు పనుల పురోగతిపై చర్చించామని తెలిపారు. విదేశాల నుంచి యూరియా దిగుమతులు నిలిచిపోవడం, రామగుండం ఎరువుల కర్మాగారంలో పూర్తిస్థాయి ఉత్పత్తి లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్ర మంత్రిని కలిశామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి రూ.50 లక్షలు చెల్లించి సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. సింగరేణి మారుపేర్ల సమస్యను ప్రస్తావించామని, కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అలాగే లెదర్ పార్క్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు.

